


కొమరెల్లి సిస్టర్స్ దీక్షిత , లాహిరి

## తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో
# కొమరవెల్లి సిస్టర్స్ జోరు

హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త: తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న తెలంగాణ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత నెం.1 దీక్షిత కొమరవెళ్ళి సబ్ జూనియర్ బాలికల విభాగంలో శుక్రవారం అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. మూడు రేసుల్లో నెగ్గి హాట్రిక్ ఫ్లీట్‌తో టాప్‌ప్లేస్‌లో నిలిచిన తన చెల్లెలు లాహిరిని వెనక్కునెట్టి అగ్రస్థానంలో చేరుకుంది. హైదరాబాద్ జిల్లాకు చెందిన కొమరవెల్లి సిస్టర్స్, స్వర్ణం, రజతం కోసం ముందజలో ఉన్నారు. రసూల్‌పురా ఉద్భవ్ స్కూల్‌కు చెందిన ఈఇద్దరు అమ్మాయిలు చెరో 17పాయింట్లతో సమానంగా నిలిచారు. అయితే 7రేసుల అనంతరం ఒకదాన్ని మినహాయించేందుకు (డిస్కార్డ్)ను అనుమతించడంతో దీక్షిత కేవలం ఒక పాయింట్ తేడాతో తన సోదరి లాహిరిని వెనక్కు నెట్టింది. రాష్ట్రంలో టాప్‌సీడెడ్ సెయిలర్స్ అయిన ఈఇద్దరు మధ్య విజేత ఎవరో శనివారం తేలనుంది. మహబూబ్‌నగర్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న షేక్‌పేట్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన బిందు రత్లావత్ తన అత్యుత్తమ ప్రదర్శనతో మూడోస్థానంలో నిలిచింది. రాష్ట్ర ఛాంపియన్‌షిప్‌లో మొదటి కాంస్య పతకాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. బాలుర విభాగంలో వికారాబాద్‌కు చెందిన బన్నీ బొంగూరు అగ్రస్థానంలో కొనసాగుతుండగా, మహబూబ్‌నగర్‌కు చెందిన వినోద్‌దండు అతని తర్వాతి స్థానంలో ఉన్నాడు. ఇక జూనియర్ ఓపెన్ విభాగంలో 3రేసులు పూర్తయ్యాయి. ఇందులో జూనియర్ నేషనల్ ఛాంపియన్ వైష్ణవి అంచాలను అందుకుంది. మూడింటిలో ౦రెండు స్పష్టమైన విజయాలతో అగ్రస్థానంలో నిలిచింది. పోటీలో ఉన్న అబ్బాయిలందరినీ స్పష్టమైన తేడాతో ఓడించింది. మొత్తం 59 ఎంట్రీలతో తెలంగాణలో జరుగుతున్న అతిపెద్ద రెగట్టా పోటీల్లో ఇది ఒకటి అని రాష్ట్ర సెయింలింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దాది భోటే అన్నారు.కాగా ఈటోర్నీ శనివారంతో ముగియనుంది. సాయంత్రం ఐదుగంటలకు హైదరాబాద్‌లో యాచ్‌క్లబ్‌లో విజేతలకు ట్రోఫీలు అందజేస్తారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించాలి

కంటోన్మెంట్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: కస్తూర్బా విద్యా సంస్థలు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందించడంతో పాటు వారికి మౌళిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరుతూ శుక్రవారం తల్లుల సంఘం,బాలుల హక్కుల పరిరక్షణ వేధిక ఆధ్వర్యంలో సిఎం రేవంత్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలోని ప్రజా వాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సాయిలక్ష్మి, లావణ్య, వినిత,లక్ష్మి నారాయణ, గాదెపాక బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ వార్త

## పోలీసు స్టేషన్ ముందు రీల్
# యువకుడికి జైల్

**గంజాయి తాగుతూ స్టేషన్ ముందు ఓవరాక్షన్**

**వీడియో ఇన్‌స్టాగ్రాంలో పెట్టడంతో అరెస్ట్**

హైదరాబాదు, డిసెంబరు 29,ప్రభాతవార్త: కాలక్షేపం కోసమో.. వినోదం కోసమే చేయాల్సిన రీల్స్,షార్ట్ వీడియోలు ఇప్పుడు యువకులను జైలుపాలు చేస్తున్నాయి. మరికొన్ని ప్రాణాల మీదరకు తెస్తున్నాయి. అందుకు కారణం ఆవీడియోల్లో యువత చేస్తున్న ఓవర్ యాక్షణ్ కారణం విచక్షణ కోల్పోయి ఇష్టమొచ్చినట్లుగా వ్యవహారించడమే.. ఈక్రమంలోనే సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ ముందు వంశీ కృష్ణ అనే యువకుడు ఓవరాక్షన్ చేశాడు. పోలీస్ స్టేషన్ ముందే గంజాయి తాగుతూ.. ఒర్యాంప్ సాంగ్‌కు రీల్ చేశాడు. చేసినోడు ఊరుకే ఉండక.. ఆరీల్‌ను ఇన్‌స్ట్రాగ్రాంలో పెట్టాయి. ఈనేపథ్యంలో ఇన్‌స్ట్రాగ్రాంలో వంశీకృష్ణ పోస్ట్‌ను చూసిన పలువురు నెటిజన్లు ఆపోస్టును ట్విట్టర్‌లో సిఎం రేవంత్‌రెడ్డికి ట్యాగ్ చేశారు. వెంటనే స్పందించిన ఉన్నతాధికారులు వంశీకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి న్యాయమూర్తి ముందు హాజరుపర్చగా ..వంశీకృష్ణకు ఎనిమిదిరోజుల జైలుశిక్షను విధించారు. అయితే పోలీసులు ఆయువకున్ని కేవలం అరెస్ట్ చేయడంతోపాటు రీల్ వర్సెస్ జైల్ అనే పేరుతో ..పాతవీడియోతో పాటు వంశీకృష్ణను చంచల్‌గూడ జైల్‌కు పంపించే వీడియోను కూడా కలిపి రీల్ క్రియోట్ చేసి..దాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇలాంటి ఓవరాక్షన్లు చేస్తే ..జైలుకు వెళ్లడం పక్కా అన్న వార్నింగ్‌ను ఈవీడియో ద్వారా యువతకు పోలీసులు జారీ చేశారు.

# దళారుల చేతుల్లో.. మీ సేవా కేంద్రాలు

**దళారులకు కల్పతరువుగా మారాయి**

మీ సేవ సులభంగా, వేగంగా

ప్రజలకు సత్వర సేవలను అందించాలనే మంచి ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన 'మీసేవా' కేంద్రాలు కాస్తా దళారులకు కల్పతరువుగా మారాయి. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలలో పర్యవేక్షణ, నిఘా లేకపోవడంతో అక్రమాలకు అడ్డాలు మారాయి. ప్రజలకు సత్వర, మెరుగైన ఈ-పౌరసేవలు అందించేందుకు ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తే అక్రమాలకు అడ్డాలుగా మారాయి. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు కంటే అధికంగా వసూలు చేస్తూ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, ఫలితంగా తమకు తీవ్ర ఇబ్బందికరంగా మారిందని బాధితులు ఆరోపిస్తున్నారు.

హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త : ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, మీసేవా కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కై ఇటువంటి అక్రమాలకు, అవినీతి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మరోవైపు ప్రజలు సొంతంగా ఇంటినుంచే దరఖాస్తు చేసేందుకు అందుబాటులోకి తీసుకువచ్చిన 'టి-యాప్' ఫోలియో, మీసేవా 2.0 సిటిజన్ సర్వీసుల ద్వారా వచ్చిన దరఖాస్తులను సంబంధిత విభాగాల అధికారులు అంతగా పరిశీలలించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవేళ దరఖాస్తులు పరిశీలించినా తీవ్ర జాప్యం చేయడంతో ప్రజలు విధిలేని పరిస్థితుల్లో మీసేవా కేంద్రాలను ఆశ్రయించాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడు తోంది. ఫలితంగా ఆయా కేంద్రాల నిర్వాహకులు అడిగినంత డబ్బులు ఇవ్వకపోతే పని ప్రారంభించే పరిస్థితి కనిపించడం లేదు. పలుచోట్ల నిర్వాహకులు అడిగినంత డబ్బు చెల్లిస్తేనే సంక్షేమ పథకాలు, పౌరసేవలకు దరఖాస్తులను స్వీకరిస్తుండగా, డబ్బులు ఇవ్వకపోతే దరఖాస్తులను వెనక్కిపంపించి వేస్తున్నారు. 2014 తర్వాత తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భవించిన అనంతరం కేంద్రాల నిర్వహణ బాధ్యతలను తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ (టిఎస్‌టిఎస్) పరిధిలోకి వచ్చింది. గతంలో అర్హతలు లేకున్నా నిర్వాహకుల అవతారమెత్తిన దళారులను తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. క్షేత్రస్థాయిలో మీసేవా కేంద్రాల పనితీరుపై కనీస పర్యవేక్షణ లేకపోగా సేవల కొనసాగిస్తున్నా చర్యల్లేవు. నిబంధనల ప్రకారం కేంద్రాల్లో ఏ-కేటగిరి సేవలకు రూ.35, బీ కేటగిరికి రూ.45 ఫీజు తీసుకోవాల్సి ఉండగా, అంతకుమించి తీసుకోవడానికి వీలులేదు. ప్రజలు పౌరసేవలను పొందేందుకు వెళ్లిన వెంటనే ముందుగా ఓ ధర చెప్పడం, ఇష్టమైతే దరఖాస్తు చేయండి, లేకుండా లేదు అని కరాఖండిగా చెబుతుండడంతో లబ్దిదారులు విస్మయానికి గురవుతున్నారు. దీంతో చేసేదేమిలేక వారు కేంద్రాల నిర్వాహకులు అడిగినంత చెల్లించడానికి ముందుకు వస్తున్నారు.

ఒకవేళ కేంద్రాలపై ఫిర్యాదులు వస్తే సాధారణ హెచ్చరికలు తప్ప కఠిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవనే చెప్పవచ్చు. మరో నూతనంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని సంక్షేమ కార్యక్రమాలు దరఖాస్తులు చేసుకోవడానికి మీసేవా కేంద్రాలనే ఆశ్రయించాల్సి వచ్చే పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నగరంలోని ముషీరాబాద్, అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ సమీపంలో, హిమాయత్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలలో ఉన్న మీసేవా కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి దళారుల ఆగడాలను అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

# అసిస్టెంట్ సిటీ ప్లానర్లు ఎక్కడ?

**23, 24 సర్కిళ్ళలో నేతల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు**

**ఓ కార్పొరేటర్ అనుచరుల ఇష్టారాజ్యం**

కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబర్ 29 ప్రభాతవార్త : 23,24 కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ళ టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. కూకట్‌పల్లి జంట సర్కిళ్ళ లోని టౌన్ ప్లానింగ్ విభాగం. డబ్బులు ఇస్తే చాలు నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని అంతస్తులైనా వేసుకోవచ్చని కొ ందరు అదికారులు భరోసా ఇస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు లక్షల రూపాయలు దండుకుంటూ, దొడ్డిదారిన బహుళ అంతస్తుల భవనాలను ప్రోత్సహిస్తున్నారని స్థానికంగా పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. కూకట్‌పల్లి, కెపిహెచ్‌బికాలనీ, బాలాజీనగర్, వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ , హైదర్‌నగర్, మూసాపేట, బాలానగర్ తదితర ప్రాంతాల్లో స్థానికంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాల విషయంలో ఫిర్యాదులు అందినప్పటికీ వాటిని సంబంధిత అధికార యంత్రాంగం బుట్ట దాఖలు చేస్తూన్నారనే విమర్శలు ఉన్నాయి. గత కొంత కాలంగా ఇక్కడ జరుగుతున్న అవినీతి అక్రమాల విషయంలో ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఒకటికాదు రెండు కాదు ఒక్క బిల్డర్ ఏకంగా పదుల సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మానాలు చేస్తున్న అధికారులకు మాత్రం పట్టించుకోవడంలేదు. అధికారులకు కావలసింది అందుతుంది కాబట్టి వీరికి అక్రమ నిర్మాణాలతో పనిలేదు. ప్రభుత్వ ఉద్యోగులు అన్న విషయం మర్చిపోయి నుట్ట పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా అక్రమ నిర్మాణాల నుండి అందినంత దండుకుంటున్నారు. దీనికితోడు స్థానిక నాయకుల అండదండలు ఉంటే చాలు ఇక రెచ్చిపోవడమే తరువాయి. నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ఒక్కొక్క అపార్ట్‌మెంట్ నుండి ఏకంగా



బహుళంతస్తుల భవనం

10లక్షలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా అప్పనంగా సొమ్ములు వస్తుంటే ఎవరైనా వద్దంటారా అని పలువురు ఆరోపిస్తున్నారు. నిబంధనలు భేఖాతరు చేస్తూ ఏకంగా సెల్లార్ తవ్వి 6 ఫ్లోర్ల వరకు వేసినా పెంట్ హౌస్ కోసం పాకులాడటం ఇక్కడ పరిపాటిగా మారింది. స్థానికంగా జరుగుతున్న అవినీతి ఏ స్థాయిలో ఉందంటే గ్రేటర్ మున్సిపల్ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సైతం ఇక్కడి దరిదాపుల్లో కనిపించకపోవడం కొసమెరుపు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఒక్కొక్క డివిజన్‌లో వందల సంఖ్యలో నిర్మాణాలు అవుతున్నాయంటే వీరి సంపాదన ఎంతో అర్థం చేసుకోవచ్చు. సమాచారం హక్కు చట్టం ద్వారా, స్థానికుల ద్వారా పలుమార్లు వినతిపత్రాలు వస్తున్నా వందల సంఖ్యలో ఫిర్యాదులు ఉన్నా వీటన్నిటిని అధికారులు భేఖాతర్ చేస్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు వస్తే అంత ఎక్కువ వసూలు చేయొచ్చు అన్న ధీమాతో అధికారులు ఉండటమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

**నాలాను మింగేస్తున్న బడా బాబులు..**

**కార్పోరేటర్ అనుచరుల ఇష్టారాజ్యం**

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దేవినగర్ సమీపంలో నాలాను రోడ్డుగా చేసుకుని ఏకంగా పెద్ద ఎత్తున బహుళ అంతస్తుల నిర్మాణం వెలుస్తోంది. స్థానిక కార్పోరేటర్ అతనికి సంబంధించిన కొంతమంది పార్టనర్లు చేపడుతున్న అక్రమ నిర్మాణం విషయంలో స్థానిక ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నల్లచెరువు నుండి ప్రవహించే నీరు నాలామీదుగా వెళుతుండగా వాటిపై కప్పు వేసి దాన్ని రోడ్డుగా చూపిస్తూ నిర్మాణం చేపట్టడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమేరకే పర్మిషన్ ఉండగా నిర్మాణదారులు ఏకంగా ఐదు అంతస్థుల భవనాన్ని నిర్మించడం చర్చనీయాంశంగా మారింది.

**టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరు మారేనా..?**

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని జంట సర్కిళ ్ళల్లో వందలాది అక్రమ నిర్మాణాల వ్యవహారం కొత్త ప్రభుత్వ హయాంలోనైనా మారుతుందా అనే అనుమానాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు కొరడా ఝులిపిస్తే తప్ప అక్రమాలకు అడ్డుకట్ట వేయలేరని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు కూకట్‌పల్లి జంట సర్కిళ్లలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

**మున్సిపల్ శాఖ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్**

నార్సింగి, డిసెంబర్ 29 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశంను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.జాన్ శాంసన్ పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగిలో ఏర్పాటు చేసిన ఓ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దరఖాస్తు ఫారాల పంపిణీ, ప్రజలు పూర్తి వివరాలను రాస్తున్నారా? లేదా? అన్న అంశాలను క్షుణ్ణంగా పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 6.వ,తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, గడువులోపు ప్రజలంతా తమ దరఖాస్తు ఫారంలను సంబంధిత వార్డు కార్యాలయాల్లో అందజేయాలన్నారు. అధికారులు పూర్తి ఉచితంగా ప్రజలకు దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయాలని, జిరాక్స్ సెంటర్లకు వెళ్లేలా చేయవద్దని, ప్రజలెవ్వరూ ఫారాలను కొనవద్దని సూచించారు. అనంతరం నార్సింగి మున్సిపల్ కమీషనర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ మా వద్దకు వచ్చే ప్రతీ ఒక్కరికి పూర్తి ఉచితంగానే దరఖాస్తు ఫారాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రెండు రోజులలో నార్సింగి మున్సిపాలిటీలోని అన్ని వార్డు కార్యాలయాలలో కలిపి 2,244.దరఖాస్తులు వచ్చాయని వివరించారు. ఉదయం 9.గంటల నుంచి సాయంత్రం 5.గంటల వరకు ఆయా సెంటర్ల వద్ద సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నార్సింగిలో మాజీ సర్పంచ్ క్యాతం అశోక్ యాదవ్, కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్, మణికొండ మున్సిపాలిటీలో చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్‌లు ప్రజా పాలనలో పాల్గొన్నారు.



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రజా పాలనలో పాల్గొని దరఖాస్తు ఫారాలను పరిశీలిస్తున్న మున్సిపల్ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్

# నిథమ్ డైరెక్టర్‌పై తీవ్ర ఆరోపణలు

**ఇనిస్టిట్యూట్‌ను రియల్ ఎస్టేట్ కార్యాలయంగా వాడుకున్నాడని ఉద్యోగుల ఆరోపణ**

**చిన్నంరెడ్డి అవినీతిని కాగ్ నివేదిక సైతం ఎత్తి చూపిందంటున్న ఉద్యోగులు**

**డైరెక్టర్‌ను వెంటనే తొలగించి నష్టాన్ని అతనితోనే భర్తీ చేయించాలని డిమాండ్**



నిథమ్ అడ్మిన్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టిన ఉద్యోగులు

గచ్చిబౌలి, డిసెంబరు 29 ప్రభాతవార్త : గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజిమెంట్ (నిథమ్) డైరెక్టర్ ఎస్.చిన్నంరెడ్డి మీద తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా నిథమ్ ఉద్యోగులే డైరెక్టర్ చిన్నంరెడ్డి కారణంగా నిథమ్ మూతపడే స్థితికి వచ్చిందంటూ ఆందోళనకు దిగారు. శుక్రవారం గచ్చిబౌలిలోని నిథమ్ క్యాంపస్ ఆవరణలోని అడ్మిన్ కార్యాలయం ముందు ఇనిస్టిట్యూట్ ఉద్యోగులు నల్లరంగు దుస్తులు ధరించి ఆందోళనకు దిగారు. వెంటనే చిన్నంరెడ్డిని నిథమ్ డైరెక్టర్ విధుల నుంచి తొలగించడంతో పాటు చిన్నంరెడ్డి అవినీతికి పాల్పడిన సొమ్మును అతనితోనే భర్తీ చేయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో చిన్నంరెడ్డి చేసిన నిరంకుశ పాలనపై కాగ్ నివేదిక సైతం అక్షింతలు వేసిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిథమ్ రిజిస్ట్రార్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ మహేందర్‌రెడ్డి, డాక్టర్ కిరణ్మయి, ఫైనాన్స్ ఆఫీసర్ శేషయ్య, ఎస్టాబిలిష్‌మెంట్ ఆఫీసర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజి మెంట్‌లో యువతకు శిక్షణ అందిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్రంలో సోనియాగాంధీ, నాటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా నిథమ్ ప్రారంభమైందన్నారు. గతంలో ఉత్తమం గా పనిచేసిన నిథమ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్‌గా చిన్నంరెడ్డి బాధ్యతలు స్వీకరించడం తోనే పతనంవైపు పయనం ప్రారంభమైందని అన్నారు. 2016లో నిథమ్ డైరెక్టర్‌గా చిన్నంరెడ్డి ఎంపిక పైవరీతో జరిగిందని, టూరిజం అండ్ హాస్పిటాలిటీలో డిగ్రీ లేకపో యినా నాటి ప్రభుత్వంలో కీలక పాత్రలో ఉన్న తన సోదరుడి అండదండలతో నిథమ్ డైరెక్టర్‌గా చిన్నంరెడ్డి ఎంపిక జరిగిందన్నారు. ఏ యూనివర్సిటీ విసి తీసుకోని విధంగా నిథమ్ డైరెక్టర్‌గా చిన్నంరెడ్డి నెలకు 3.30లక్షల జీతాన్ని అక్రమ మార్గంలో తీసుకున్నాడన్నారు. దేశ, విదేశాల నుంచి విద్యార్థులు గతంలో నిథమ్‌లో కోర్సులు అభ్యసించేందుకు వచ్చే వారని, గతంలో 900 ఉండే నిథమ్ విద్యార్థుల సంఖ్య చిన్నంరెడ్డి అవినీతి, ఒంటెద్దు పోకడల కారణంగా నేడు 250కి పడిపోయిందన్నారు. నిథమ్‌లో 13కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసిందని, వాస్తంగా దాదాపు 50కోట్ల వరకు అవినీతి జరిగిందన్నారు. గవర్నింగ్ కౌన్సిల్ అనుమతి లేకుండా చిన్నంరెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరించాడని, నిథమ్‌ను రియల్ ఎస్టేట్ కార్యాలయంగా, రాజకీయ పార్టీ ఆఫీస్‌గా వాడుకున్నాడని ఆరోపించారు. చిన్నంరెడ్డిని నిథమ్ డైరెక్టర్ పదవి నుంచి తొలగించడంతో పాటు అతని అవినీతిపై విచారణ చేయించి, అవినీతి సొమ్మును అతని చేతే కట్టించాలన్నారు.

## న్యూ ఇయర్ వేళ
# డ్రగ్స్ కలకలం

**ఫిలింనగర్‌లో ఒకరి అరెస్టు**

హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త : న్యూఇయర్ వేళ జూబ్లీహిల్స్ పరిధిలోని ఫిలింనగర్‌లో డ్రగ్స్ కలకలం రేపాయి. సబ్ పార్కింగ్ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు బెంగళూరుకు చెందిన క్యాబ్ డ్రైవర్ బాబు కిరణ్‌గా గుర్తించారు. అతిన వద్ద నుంచి 20 గ్రాముల ఎండిఎంఏను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుఅన్నరు. బాబు కిరణ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు అతని నుంచి మరింత సమాచారం రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పబ్‌కు వచ్చే కొంత మందికి అతడు డ్రగ్స్ అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. వారిని పట్టుకు నేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఈ డ్రగ్స్ తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం.


**షాద్‌నగర్‌లో ఎన్‌డిపిఎస్ డ్రగ్స్**

ఇదిలా వుంటే నూతన సంవత్సర వేడుకల కోసం ఇద్దరు వ్యక్తులు డ్రగ్స్ తరలిస్తుండగా షాద్‌నగర్ ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు షాద్‌నగర్ పరిధిలోని రాయికల్ టోల్ ప్లాజా వద్ద స్థానిక పోలీసుల సహకారంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు లక్ష రూపాయలు విలువైన ఎన్‌డిపిఎస్ అనే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. న్యూ ఇయర్ వేడుకల కోసం గోవా నుండి ఈ డ్రగ్స్ తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో
# గోల్డ్ ఏటిఎం

హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త: నగరంలోని అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో గోల్డ్ ఏటిఏంను శుక్రవారం ప్రారంభించారు. గోల్డ్‌సిక్కా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈఏటిఎంను నిర్వాహకులు ప్రారంభించారు. ఇందులో 0.5గ్రాముల నుంచి 20గ్రాముల వరకు బంగారాన్ని ఏటిఎం ద్వారా కొనుగోలు చేయవచ్చు. డెబిట్, క్రెడిట్, కార్డు లేదా యూపిఐ పేమెంట్ ద్వారా బంగారు, వెండి కాయిన్లను కొనుగోలు చేయవచ్చు. బ్యాంకులు ఏర్పాటు చేసిన ఏటిఎంలో డబ్బులు తీసుకున్న విధంగానే గోల్డ్‌సిక్కా ఏటిఎంలో బంగారు, వెండి కాయిన్లు తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. ఏటిఎంలో నిర్దేశించిన విధంగా లావాదేవీలు పూర్తయిన వెంటనే మనం ఎంచుకున్న బంగారు కాయిన్లు బయటకు వస్తాయి. కాగా ప్రారంభించిన రోజే వినియోగదారుల నుంచి ఆశించిన దానికంటే మంచి స్పందన వస్తుందని గోల్డ్ సిక్కాల యాజమాన్యం తెలిపింది. ఈకార్యక్రమంలో నిర్వాహకులు తరుజ్,అంబికా బర్మన్, డా.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పని చేస్తున్న షాపులోనే
# మెకానిక్ ఆత్మహత్య



సరూర్‌నగర్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: ఉరి వేసుకొని ఓ బైక్ మెకానిక్ బలవర్మరణానికి పాల్పడ్డాడు. తాను పని చేస్తున్న షాపులోనే మెకానిక్ ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఈ సంఘటన నగర శివార్లలోని మీర్‌పేట్ పిఎస్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కందుకూరు ఆకులమైలారం గ్రామానికి చెందిన సమీర్ (19) అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు చెందిన అల్మాస్‌గూడ విశాఖనగర్‌లోని రాఘవేంద్ర బైక్ పాయింట్ మెకానిక్ షాపులో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అయితే షాపులో ఎవరూ లేని సమయంలో శు క్రవారం సమీర్ చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందడంతో పోలీసులు కేసును నమోదు చేసుకొని అతని మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**చాగంటి కోటేశ్వరరావు నుంచి ప్రశంసలు**

## అందుకున్న ఉదయ్‌కుమార్

చిక్కడపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త: శృంగేరి జగద్గురువుల దివ్యానుగ్రహంతో జరిగిన ఆధ్యాత్మిక ప్రత్యేక కార్యక్రమంలో ప్రవచన చక్రవర్తి, శారదా జ్ఞానపుత్ర బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావుపై అద్భుతమైన గీతానికి సంబంధించిన రచనను ఉదయరాగం సంస్థ అధినేత, ప్రముఖ గాయకుడు బి.ఉదయ్‌కుమార్ నిర్వహించి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. దత్తజయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంతో గొప్పగా గీత రచనను చేసిన ఉదయ్‌కుమార్‌ను బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు సత్కరించి అభినందించారు. ఇదే సభలో పాల్గొన్న మహామహోపాధ్యాయ, భారతీ తీర్థ పురస్కారగ్రహీత బ్రహ్మశ్రీ డాక్టర్ దోర్బల ప్రభాకరశర్మ, దర్శనమం ఆధ్యాత్మిక పత్రిక సంపాదకులు మరుమాముల వెంకటరమణ కూడా అభినందించిన వారిలో ఉన్నారు.

# కుల గణనను నిర్వహిస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించడం పట్ల హర్షం

**కుల గణన చేపట్టే పార్టీలకే ఓబిసిల మద్దతు**

**అఖిల భారత ఓబిసి హక్కుల పరిరక్షణ వేదిక**

సైఫాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త: 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో అధికారంలోకి వస్తే దేశంలో కుల గణనను నిర్వహించాలన్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించడంపై అఖిల భారత ఓబిసి హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు ఆళ్ళ రామకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. జనాభా గణనలో కుల గణన నిర్వహిస్తేనే ఓబిసిలకు నిజమైన సామాజిక న్యాయం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం నాడిక్కడ వేదిక జాతీయ కార్యాయలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ఓబిసిలు అన్ని రంగాలలో నష్టపోతున్నారని తెలిసి కూడా కుల గణన కోసం పెరుగుతున్న డిమాండ్‌పై బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎందుకు మౌనం వహిస్తున్నదో అర్థం కావడం లేదన్నారు. గతంలో ఓబిసి కుల గణన చేస్తామని హామీ ఇచ్చిన మోసం చేసిన బిజెపికి వచ్చే ఎన్నికల్లో ఓబిసి ప్రజల అగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. బ్రిటిష్ కాలం 1931లో చివరి ఓబిసి జనాభ గణన నిర్వహించడం జరిగిందని అందులో వారి జనాభా 52 శాతం ఉన్నట్లుగా గుర్తించబడిందని, యుపిఎ ప్రభుత్వం 2011లో సామాజిక, ఆర్థిక కుల గణన నిర్వహించినప్పటికి ఆది తప్పులతో కూడిన డేటాగా తెల్చి బిజెపి ప్రభుత్వం బహిరంగపరచలేదని రామకృష్ణ ఆరోపించారు. ఓబిసిలకు 27 శాతం రిజర్వేషన్‌లు కల్పించే విధానం 1931 జనాభా లెక్కల డేటా ఆధారంగా 1990 నుంచి నేటికి ఆదే విధంగా కొనసాగుతుందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 సంవత్సరాలు గడిచినప్పటికి దేశంలో కులగణన జరగకపోవడం వల్ల ఓబిసిలు తీవ్రంగా నష్టపోతున్నారని, తక్షణమే కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి తగు ఆదేశాలు ఇవ్వాలని 2021లో తాను సుప్రీంకోర్టులో ఫిటిషన్ దాఖలు చేయడం జరిగిందని దీనిపైన వివరణ ఇవ్వాలని సు ప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కొరగా దేశంలో కుల గణన కుదరదని, అసాధ్యమని కేంద్రం ప్రకటించడం దారుణమన్నారు.

# అర్హులందరికి అభయహస్తం పతకాలు అందజేస్తాం

**బండ్లగూడ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్**



పజా పాలన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 29 ప్రభాతవార్త : అర్హులందరికి అభయ హస్తం పతకాలు అందేలా చూస్తామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం కార్పోరేషన్‌లోని పలు వార్డులలో జరిగిన సమావేశాల్లో కమీషనర్ శరత్‌చంద్ర, డిప్యూటీ మేయర్ పి.రాజేందర్‌రెడ్డిలతో కలిసి మేయర్ పాల్గొన్నారు. ప్రజలకు దరఖాస్తు ఫారాలు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సందేశంను చదివి వినిపించారు. దరఖాస్తు ఫారంను ఎలా పూరించాలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ అభయహస్తం పతకాలకు అర్హులని, అందరూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మహాలక్ష్మి పతకం కింద ప్రతినెల రూ.2,500 ఆర్థిక సహాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, రైతు భరోసా కింద ఏటా ఎకరానికి రూ.15వేలు, వ్యవసాయ కూలీలైతే రూ.12.వేలు, ఇందిరమ్మ ఇళ్లు పతకం కింద ఇంటి నిర్మాణంకు ఆర్థిక సహాయం, గృహజ్యోతి పతకం కింద 200.యూనిట్ల వరకు ఉచిత కరెంటు సరఫరా, చేయూత పతకం కింద 4.వేల పింఛన్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. దరఖాస్తు దారులు తప్పకుండా ఆధార్ కార్డులు, తెల్ల రేషన్ కార్డుల జిరాక్స్‌లను జత పర్చాలని, కరెంటు మీటర్ నెంబర్, గ్యాస్ కనెక్షన్ నెంబర్, భూమి సర్వే నెంబర్, సాగు చేస్తున్న ఎకరాలెన్నీ వంటి పూర్తి వివరాలను దరఖాస్తు ఫారంలో రాయాలని తెలిపారు. ఎవరూ ఆందోళన పడాల్సిన పని లేదని, జనవరి 6.వ,తేదీ వరకు దరఖాస్తు చేసుకునే వీలుందని, అర్హులంతా ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు శ్రీనాథ్ రెడ్డి, పుష్పమ్మ, క్యాతం పద్మావతి పాపయ్యయాదవ్, భూపాల్‌గౌడ్, ఆర్‌డిఎంఎ శ్రీనివాస్‌రెడ్డి, ఏడీ కె.శ్రీనివాస్, ఎస్ఇ శివానంద్, డిఇఇ యాదయ్య, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, ఏఇఇ. రాజ్‌కుమార్, టిఎంసి శ్రీలత పాల్గొన్నారు. అలాగే హైదర్షాకోట్ గ్రామ పంచాయతీ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పోరేటర్ రవీందర్‌రెడ్డి(బాబు), వెంకటప్ప, శారద, స్వాతిరెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు న్యాయం జరిగేలా చూడాలి

**ప్రభుత్వానికి ఫోరం ఫర్ ఎస్సీ,ఎస్టీ, బిసి అడ్వకేట్స్ విజ్ఞప్తి**



సమావవేశంలో మాట్లాడుతున్న నారాయణ, గాలివినోద్‌కుమార్, భీమారావు

హైదరాబాద్, డిసెంబరు 29,ప్రభాతవార్త: న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయవ్యవస్థలో 93శాతానికి పైగా ఉన్న ఎస్సీ,ఎస్టీ,బిసిలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయా వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌ంరెడ్డికి ఫోరం ఫర్ ఎస్సీ,ఎస్టీ, బిసి అడ్వకేట్ ఆఫ్ తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ న్యాయమూర్తి, ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు నిమ్మ నారాయణ, ఫోరం ప్రతినిధులు గాలివినోద్‌కుమార్, భీమరావులు మాట్లాడారు. 75సంవత్సరాల్లో నేటి వరకు ఒక్కరు కూడా అడ్వకేట్ జనరల్, అడిషనల్ అడ్వకేట్ జనరల్ పదవులు ఎస్సీ,ఎస్టీలకు దక్కలేదన్నారు. గత ప్రభుత్వం నామమాత్రంగా బిసివర్గానికి చెందిన వ్యక్తినిఅడ్వకేట్ జనరల్‌గా నియమించిందన్నారు. ఇటు న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్సీ,ఎస్టీ బిసిలు వివక్షకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వ ప్లీడర్లు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, స్టాండింగ్ కౌన్సిల్ నియామకాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వాంతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఏసామాజిక వర్గం ముఖ్యమంత్రి ఉంటే ఆవర్గానికి చెందిన వ్యక్తులకే న్యాయ వ్యవస్థలో అవకాశాలు ఇస్తుండటం వివక్ష ఏస్థాయిలో జరుగుతుందో స్పష్టమవుతుందన్నారు. ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సైతం హైకోర్టు న్యాయమూర్తుల నియామకాలకు పంపిన జాబితాలో బలహీనవర్గాలకు చెందిన వారి పేర్లు లేకపోవడం విస్మయాన్ని కలిగించిందన్నారు. ఎస్సీ,ఎస్టీవర్గాలకు చెందినవారి పేర్లతో కూడిన జాబితాను పంపే వరకు నియామక ప్రక్రియ నిలుపుదల చేయాలని ప్రధాన న్యాయమూర్తికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో అడ్వకేట్లు భూమ గంగాధర్‌గౌడ్, బైరి రాకేష్‌కుమార్, లక్ష్మీనారాయణ, కమలాకర్, దున్న అంబేడ్కర్, అన్నపూర్ణ, సుమిత్ర, సల్మా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు

**కూల్చివేస్తున్న మళ్లీ మళ్లీ నిర్మాణాలు**

**అక్రమ నిర్మాణాలు జరిపితే చర్యలు తప్పవు : ఏసిపి**

బేగంపేట్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: బేగంపేట్ మాతాజీనగర్ బాలానగర్ మండలం సర్వే నెంబర్ 194బై8బై1లో అక్రమ నిర్మాణల పరంపర కొనసాగుతోంది. ఈ ప్రభుత్వ స్థలంలో ఓ బడా కంపెనీకి చెందిన నిర్మాణాలు చేపడితే అక్రమ లేఅవుట్‌గా పేర్కొంటు అప్పటి జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్థన్‌రెడ్డి హాయంలో అధికారులు కూల్చివేశారు. ఇలాంటి కూల్చివేతలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. అధికారులు కూల్చడం, వారు నిర్మించడం పరిపాటిగా మారింది. కొన్నిసార్లు అక్రమ నిర్మాణాల వెనుక అధికారుల అండదండలు ఉన్నట్లుగా విమర్శలు కూడా ఉన్నాయి. ఇది ప్రభుత్వ స్థలమని పలుమార్లు కూల్చివేతలు జరిపినా తాజాగా ఇక్కడ ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అధికారులే సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బేగంపేట్ మాతాజీనగర్‌ను ఆనుకొని ఉన్న బాలానగర్ మండలం సర్వే నెంబర్ 194బై8బై1లో 12 ఎకరాల 20 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. 2015లో ఈ స్థలంలో ఓ పెద్దకంపెనీ నిర్మాణాలు జరుపగా ఇది ప్రభుత్వ స్థలమపి అప్పట్లో కూల్చివేతలు జరిపారు. మళ్లి 2017లా నిర్మాణాలు చేపట్టగా అప్పటి బేగంపేట డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కూల్చివేతలు జరిపారు. అయినప్పటికి ఆక్రమణదారులు 2019, 2021లో కూడా నిర్మాణాలు జరిపారు. వాటిని కూడా అధికారులు కూల్చివేశారు.

**గ్రీన్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు..** నాలాలు, చెరువుల చెట్టు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటు ఆ ప్రాంతాన్ని గ్రీన్‌జోన్‌గా అధికారులు ప్రకటించారు. ఆక్రమణదారులు అవేమి లెక్కచేయకుండా అక్రమ నిర్మాణాలను జరుపుతూనే ఉన్నారు. డిసెంబర్ మొదటి వారంలో జరిగిన ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో గత రెండు, మూడు నెలలుగా అధికారులు బిజీబిజీగా ఉన్నారు. అదనుగా భావించిన ఆక్రమణదారులు అక్రమ నిర్మాణాలను జరుపుతున్నారు. దీనికి టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకరిస్తున్నట్లుగా సమాచారం. ఈసారి మరింత ముందుకు వెళ్లిన అక్రమణదారులకు అధికారులు కూడా పూర్థిస్థాయిలో సహకరిస్తూ ఏకంగా నిర్మాణాలకు ఇంటి నెంబర్‌లు కూడా జారీ చేస్తున్నారని తెలుస్తోంది. దీనిపై ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్, మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్, విజిలెన్స్, పోలీసు అధికారులకు కూడా ఫిర్యాదు అందాయి. ఇక్కడి వ్యవహారంలో కోర్టు ఆదేశాల మేరకు బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో అక్రమణదారులపై కేసులు కూడా నమోదు అయ్యాయి.

**చర్యలు తీసుకుంటాముః బేగంపేట టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిష్టోఫర్**
ఈ సర్వే నెంబర్‌లో చాలాసార్లు అక్రమ నిర్మాణాలు జరుపగా కూల్చివేతలు జరిపాము. మళ్ళి నిర్మాణాలు జరిపితే పరిశీలించి చర్యలు తీసుకుంటాము.

## సనాతన ధర్మం కోసం పాటు పడాలి

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 29ప్రభాతవార్త: ఆంగ్లనామా సంవత్సరం హిందువులకు కొత్త సంవత్సరం కాదని,ఆంగ్లనామ సంవత్సరంలో హిందువులు సనాతన ధర్మం కోసం పాటు పడాలని తెలంగాణ భజరంగ్‌సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త అన్నారు.భజరంగ్ సేనా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1 అర్ధరాత్రి సమయంలో హిందువులు దేవాలయాలల్లో హిందువులు పూజలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సేనా ప్రతినిధులు మనోజ్, సునీల్‌అగర్వాల్, ఖాజల్‌కుష్వా, అభినవ్‌తివారి, వీరేందర్‌ఆవాస్తి,శైలజ, సౌరబ్‌తివారి, ఎస్.కె.శర్మ, ప్రవీన్‌యాదవ్, రామేశ్వర్‌మిశ్రా, నరేష్ పాల్గొన్నారు.


జుబ్లిహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్‌రెడ్డి

## తెలంగాణ ఉద్యమ వైతాళికులను మరువటం బాధాకరం

**పలువురు ప్రముఖులు**

చిక్కడపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి తొలి నాళ్లలో స్ఫూర్తి రగిలించిన షాబ్నవీస్ వెంకటరామ నరసింహారావు వంటి వారిని మరువటం బాధాకరమని ప్రముఖ వక్తలు పేర్కొన్నారు. దశాబ్దిపూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో షాబ్నవీస్ వెంకటరామనరసింహారావు సంస్మరణ సభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ దేవీప్రసాద్ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి తెలంగాణ ప్రాంత సాంస్కృతిక వికాసానికి దోహదపడిన వెంకటరామనరసింహారావు తదుపరి కాలంలో ప్రాధాన్యత ఇవ్వకపోవటానికి కారణం కులపరమైన వివక్షకావచ్చన్నారు. అధికార భాషా సంఘం పూర్వ చైర్మన్ మంత్రి శ్రీదేవి మాట్లాడుతూ వెంకటరామనరసింహారావు తెలంగాణలోతొలి తెలుగు పత్రిక 'నీలగిరి'ని ఆరంభించారని, ఆయన కోడలు ఇందిరారవు తమ మామ గారి సాహిత్య, సామాజిక సేవను వివరిస్తూ షాబ్నవీస్ అంటే రాత్రి వెల రాసే పత్రిక 'నీలగిరి' అని వెంకటరామనరసింహారావు రాత్రి వేళల్లో 'నీలగిరి'పత్రికకు కావాల్సిన అంశాలు వీధుల్లో తిరుగుతూ సమాచారం సేకరించి రాసేవాని, అందుకే ఆయన ఇంటిపేరు షాబ్నవీస్‌గా మారిందన్నారు. సాహితీవేత్త బి.జయరాములు, హైకోర్టు న్యాయవాది, ప్రముఖ గాయనీ తోటశ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రమణ్య స్వామి దేవాలయంకు రూ.4.74 లక్షలు ఆదాయం : ఈఓ అరుణ


మారేడ్‌పల్లి సుబ్రమణ్య స్వామి దేవాలయం హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

కంటోన్మెంట్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం వెస్ట్ మారేడ్‌పల్లిలో ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రమణ్య స్వామి దేవాలయం హుండీ లెక్కింపు రూ. 4.74 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ సి.సంతోష్ యాదవ్, ఆలయ ఈఓ అరుణ కుమారిలు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కింపు జరిగింది. నాలుగు నెలల వ్యవధిలో రూ. 4లక్షల 74 వేల అదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ అరుణ కుమారి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చొల్లేటి రమేశ్, జె.భాస్కర్, ఆలయ మాజీ చైర్మన్ రేపాల వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

## అభయ హస్తం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కొత్త సంజీవరెడ్డి

కంటోన్మెంట్, డిసెంబర్ 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసి చైర్మన్ కొత్త సంజీవరెడ్డి తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రజా పాలన కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేతలు గజ్వెల్ భరత్, ఆయూబ్‌ఖాన్, బిఆర్ఎస్ సీనియర్ నేత రేపాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలు అభయ హస్తం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కొంతం దీపిక


మోండా డివిజన్‌లో ప్రజా పాలన కేంద్రాలను సందర్శించిన కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్,డిసెంబర్ 29 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయ హస్తం పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. శుక్రవారం మోండా డివిజన్‌లోని మారేడ్‌పల్లి మల్టీపర్‌పస్ ఫంక్షన్ హాల్, రెజిమెంటల్ బజార్‌లోని వార్డు కార్యాలయం, టకార బస్తీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను అమె సందర్శించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు రవిందర్, శకుంతల, బిజెపి నాయకులు కొంతం నరేశ్, వీరవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య నుంచి అక్షింతలు


శ్రీహనుమాన్ దేవాలయంకు అయోధ్య నుంచి అక్షింతలు తీసుకువచ్చిన శ్రీనివాస్‌ముదిరాజ్

హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త: 1990-92వ సంవత్సరంలో కరసేవకునిగా పాల్గొన్న రామభక్తుడు, బిజెపి సీనియర్ నాయకుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ శుక్రవారం జైస్వాల్‌గార్డెన్‌లోని శ్రీహనుమాన్ దేవాలయంకు అయోధ్య శ్రీరాముని అక్షింతల కలశమును తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ముదిరాజ్ మాట్లాడుతూ శ్రీరాముడు జన్మించిన అయోధ్యలో ఆలయ నిర్మాణం హిందూవుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన పూజితా అక్షంతలను జనవరి 1వ తేదీ నుంచి జైస్వాల్ గార్డెన్‌లోని ప్రతి ఇంటికి పంపిణి చేస్తామన్నారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరంలో జరిగే ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ప్రతి ఇంట దీపావళి పండగను జరుపుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పూజారి నారాయణ పాటక్, గోల్నాక డివిజన్ బిజెపి కన్వీనర్ మూల రవీందర్‌గౌడ్, సెంట్రల్ జిల్లా యువజన మోర్చా కార్యదర్శి ఎస్.శ్రీధర్‌గౌడ్, చంద్రశేఖర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై కాంట్రాక్టర్ల శ్రమ దోపిడీ అరికట్టాలి

**ఎఐటియుసి డిమాండ్**

సైఫాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న కార్మికులపై కాంట్రాక్టర్ల శ్రమ దోపిడీని అరికట్టాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా డిమాండ్ చేశారు. ఆసుపత్రులలో శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి కార్మికులకు కనీస వేతనాలు చెల్లించకుండా అధికారులు, కాంట్రాక్టర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్‌రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం జివొ నెంబరు 21ని తీసుకువచ్చి అమలు చేయకుండా తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసి కార్మికులకు న్యాయం చేయాలని, జివొ నెంబరు 60 ప్రకారం కార్మికులకు 13,600 రావాల్సి ఉండగా కేవలం 11000 మాత్రమే చెల్లించి కార్మికులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్లర్లు కార్మికుల ఖాతాల్లో ఇఎస్ఐ, పిఎఫ్ డబ్బులు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారని, కార్మిక చట్టం ప్రకారం పండుగ సెలవులు, జాతీయన, ఆర్జిత సెలవులు కూడా అమలు కావడం లేదన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపడతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.లక్ష్మీబాయి, హసీనాబేగం, ఓమయ్య, కిష్టమ్మ, సుధాకర్, సురేష్, వినోద్‌కుమార్, వెంకట్‌రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## బాలల సమగ్రాభివృద్ధి కోసం అశ్రిత రెయిన్బో హోం కృషి

**డైరెక్టర్ నాగరాజు**


కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ నాగరాజ, కో ఆర్డినేటర్ వి.పర్వతాలు

చార్మినార్, డిసెంబరు 29 ప్రభాతవార్త : నిరు పేదల బాలల సమగ్ర అభివృద్ధి కోసం అశ్రిత రెయిన్బో హోమ్ అన్ని విధాల కృషి చేస్తున్నదని అశ్రిత రెయిన్బో హోమ్ డైరెక్టర్ నాగరాజ అన్నారు. పాతబస్తీ దూద్‌బౌలిలోని అశ్రిత హోమ్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జట్టుకు శిక్షణ ఇచ్చారు.క్రాంతి కిరణ్,ఆహరోన్, సమద్,పర్వతాలు,ప్రైమరీ హెచ్‌ఎం అసియా సుల్తానా హాజరయ్యారు.ఈ సందర్భంగా డైరెక్టర్ నాగరాజ మాట్లాడుతూ రెయిన్బో హోమ్ కొత్త సంవత్సరానికి సంబంధించిన ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరించారు.అనంతరం డైరెక్టర్ నాగరాజ మాట్లాడుతూ అశ్రిత రెయన్బో హోమ్ ద్వారా పేద పిల్లల సమగ్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అనిత,మమత,అబిద,నాగమణి,శిరిషా,కైలాష్ ప్రత్యర్థి చిల్డ్రన్ ఫౌండేషన్ టీమ్,హోమ్ టీమ్,లెర్నింగ్ సెంటర్ జట్టు పాల్గొన్నారు.

# 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేయాలి

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం**


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో చీమా శ్రీనివాస్, జస్టిస్ చంద్రకుమార్, కోలా జనార్ధన్ తదితరులు

చిక్కడపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి వెంటనే కమిటీని ఏర్పాటు చేసిన 'తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమబోర్డు'ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా తీర్మాణించింది. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఫోరం అధినేత డాక్టర్ చీమా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు డిమాండ్‌లను ఆమోదించారు. సమావేశంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, టిజెఎసి ఫర్ సోషల్ జస్టిస్ చైర్మన్ కోలా జనార్ధన్, జ్యోతిరెడ్డి, డాక్టర్ కృష్ణారావు, కొంతం యాదిరెడ్డి, ఒరుగంటి ఆనంద్, కరుణాకర్‌రెడ్డి, ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొ న్నారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులను గుర్తించడం కోసం వెంటనే కమిటీని ఏర్పాటు చేయాలని, 250 గజాల ఇంటి స్థలాన్ని నిరుపేద ఉద్యమకారులందరికీ వర్తింపచేయాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయలని, తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని, ఉద్యమంలో పాల్గొని నేడు దుర్భరంగా జీవిస్తున్న ఉద్యమకారులకు ఫించన్ సౌకర్యం, ఉచిత బస్‌పాస్, రైల్వేపాస్, ఆరోగ్య కార్డు, రూ.10లక్షల జీవితభీమాను కల్పించాలని డిమాండ్ చేసింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సం రోజున ఉద్యమకారులందరిని ప్రభుత్వం గౌరవించాలని, నిరుద్యోగ ఉద్యమకారులకు రూ.50 లక్షల వరకు వడ్డీలేని రుణాలు కేటాయించాలని, విదాయర్థి ఉద్యమకారులకు ఉద్యోగాలలో కోటా కేటాయించాలని, తెలంగాణ ఉద్యమనాయకుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడంతో పాటు వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. జర్నలిస్ట్ ఉద్యమకారులకు జర్నలిస్ట్ కాలనీలను ఏర్పాటు చేసి గృహాలను నిర్మించాలని, బస్‌పాస్, రైల్వేపాస్, ఆరోగ్య కార్డు, రూ.10లక్షల జీవిత భీమా కల్పించాలని, తెలంగాణ ప్రజా ప్రభుత్వానికి తెలంగాణ పునర్నిర్మాణంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఉద్యమకారులందరు అండగా ఉంటారని డాక్టర్ చీమా శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

## చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ


పోలీసుస్టేషన్‌ను సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్రపవార్

చిక్కడపల్లి, డిసెంబరు 29 ప్రభాతవార్త: సెంట్రల్ జోన్ డీసీపీ శరత్‌చంద్ర పవార్ చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధునాతన వసతులతో నిర్మించిన ఈ భవనంలోకి ఇటీవల పోలీసుస్టేషన్‌ను తరలించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పోలీసుస్టేషన్‌కు సంబంధించిన వివరాలను చిక్కడపల్లి ఏసీపీ మధుమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీతయ్యలు వివరించారు. పోలీసుస్టేషన్‌లోకి వచ్చే నిర్దేశిత ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుస్టేషన్ పరిధిలోకి వచ్చే నగర కేంద్ర గ్రంథాలయం, పోటీపరీక్షల విద్యార్థులతో నిత్యం కిటకిటలాడడం, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం, ఆర్టీసి కళాభవన్, ఆర్టీసి బస్‌భవన్, సినిమా హాల్స్, దర్శనీయ స్థలాలైన చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ఆర్టీసి క్రాస్ రోడ్స్ లోని లక్ష్మీగణపతి దేవాలయం, సిపిఎం రాష్ట్ర కార్యాలయం, కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం, తూనికలు కొలతల శాఖ కేంద్ర కార్యాలయం, సివిల్స్, గ్రూప్ పరీక్షల కోచింగ్ కేంద్రాలు, ప్రముఖ నాయకులు నివాసముండే ప్రాంతాల వివరాలు డీసీపీ తెలుసుకున్నారు. నేరాలు, అసాంఘిక శక్తుల పట్ల, నేరాలు, దొంగతనాలు, గంజాయ్, మత్తుమందు వినియోగించే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ విషయంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని డీసీపీ సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలను కూడా జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఏసీపీ మధుమోహన్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సీతయ్య స్టేషన్ క్రైం వివరాలను వివరించారు. అనంతరం అక్కడి నుంచి దోమలగూడ పోలీసుస్టేషన్‌ను కూడా డీసీపీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు నాగరాజు, మౌనిక తదితరులున్నారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : జంపనప్రతాప్


బోయిన్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో అభయ హస్తం కేంద్రాలను పరిశీలించిన జంపనప్రతాప్

కంటోన్మెంట్,డిసెంబర్ 29 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. శుక్రవారం కంటోన్మెంట్ 1వ వార్డులోని బోయిన్‌పల్లి సర్కిల్ కార్యాలయం, సంజీవయ్య నగర్ పరిసర ప్రాంతాలో ప్రజా పాలన కేంద్రాలను సందర్శించి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి, దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజిత్ కళ్యాణ్, శ్రీకాంత్, దుర్గయ్య, షిరాజ్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

## చైతన్య భారతి పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** రామంతాపూర్‌డివిజన్‌లోని చైతన్య భారతి స్కూల్‌లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమం ఆహుతలను ఎంతో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ లలిత, చైర్మన్ రామనర్సయ్య మాట్లాడుతూ చైతన్య భారతి స్కూల్‌లో విద్యార్థులకు అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ సందర్భంగా స్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలు ఆహుతులను ఎంతో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సామాజిక వేత్త రమేష్, బిఆర్ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సర్వ బాబుయాదవ్, జహంగీర్, బోసాని పవన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ పథకాలు : చేతన



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** హబ్సిగూడ డివిజన్‌లో అర్హులైన పేదలందరూ ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ కక్కిరేణి చేతన సూచించారు. ఈ మేరకు గురువారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని స్నేహనగర్ వార్డు కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రభుత్వం వివిధ పథకాలు చేపట్టిందని, వీటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి సంగీత, ప్రాజెక్ట్ అధికారి రమాదేవి, ఎఇ రాంరెడ్డి, పలువురు అధికారులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.



శ్రీ ధర్మ శాస్త సేవా సమాజం మల్కాజిగిరి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామీ 3వ మహా పడి పూజ కార్యక్రమం లక్ష్మీ సాయి గార్డెన్స్‌లో గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. (ప్రభాతవార్త, మల్కాజిగిరి)

## ప్రజాపాలన కార్యక్రమ కేంద్రాల పరిశీలన : ప్రజాప్రతినిధులు



ప్రజాపాలన కార్యక్రమం కేంద్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలాల



ప్రజాపాలన దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ, ఎడిఇ రాజేంద్రరెడ్డి, సునీత తదితరులు మరో చిత్రంలో కాంగ్రెస్ నాయకులు



ప్రజలకు దరఖాస్తు పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

**మలక్‌పేట, డిసెంబర్ 29 ప్రభాతవార్త :** మలక్‌పేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాలను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సందర్శించి పరిశీలించారు. ప్రజాపాలన కేంద్రాలలో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**దరఖాస్తు పత్రాలను అందజేసిన నాయకులు...** మూసారాంబాగ్ డివిజన్‌లో ఏర్పాటుచేసిన ప్రజాపాలనకేంద్రాలను డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, మలక్‌పేట అస్మాన్‌ఘడ్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రంవద్ద కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి, అధికారులు రాజేంద్రరెడ్డి, సునిత తదితరులు ఓల్డ్ మలక్‌పేటలో ప్రజాపాలన కేంద్రంవద్ద కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి చౌకి రవికుమార్, బాబు శ్రీనివాస్‌లు ప్రజలకు దరఖాస్తు పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో భాగంగా ఆరు పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో జిహెచ్ఎంసి సిబ్బంది మురళి, దావూద్ అహ్మద్, నవీన్, రాజ్‌కుమార్, ఉమేష్, గునప్ప, కృష్ణ, శ్రీనివాస్, వినయ్, చందు, శంకర్, లక్ష్మణ్, సంతోష్, దినేష్, మల్లేష్, ఉమేష్, రాజారావుగౌడ్, తుమ్మకొండ రాజు, మేకల వెంకటేశ్వరరెడ్డి, విజయలక్ష్మి, హన్మకొండ తదితతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : దేప



దరఖాస్తులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కృష్ణానగర్, సౌభాగ్యపురం, మార్గదర్శికాలనీ, హరిపురీకాలనీలలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన 6 గ్యారంటీల పథకాల దరఖాస్తు స్వీకరణ కార్యక్రమంలోని కేంద్రాలను భాస్కర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 గ్యారెంటీలను అమలు చేసి ప్రతి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బండి మధు, తల్లాటి రమేష్‌నేత, ఎన్ఎస్‌యుఐ శివ, కల్యాణ్‌యాదవ్, నగేష్, రమేష్, రఘు, లక్ష్మి, రేణుక, జయశ్రీ, సంతోష, మమత, రమాదేవి, స్వరూప, కవిత, మాధవి, లావణ్య, రాజునాయక్, అక్రమ్, శ్రీధర్, జాంహాగిర్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



డిసి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తున్న సిపిఎం నేతలు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** ప్రజాపాలన కేంద్రాలలో ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నేతలు ఎర్రం శ్రీనివాస్, జె.వెంకన్నలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ డిసి శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రాలలో ప్రజలకు కనీస వసతులు లేవని, దరఖాస్తు ఫారంలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొన్ని మీసేవా కేంద్రాలలో దరఖాస్తు ఫారం అధిక ధరలకు విక్రయిస్తున్నారని, వీటిని అరికట్టాలని కోరారు. లక్ష్మినారాయణకాలనీ, దేవేందర్‌నగర్, టివి కాలనీ వాసులకు ఉప్పల్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డిసి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నేతలు పాల్గొన్నారు.

## క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి కృషి



కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** క్రిస్టియన్ మైనార్టీల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ చిలుకానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందజే స్తున్న క్రిస్మిస్ కానుకలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా క్రిస్టియన్ మైనార్టీలకు తగు చేయూత అందిస్తుందని, వీటిని ప్రతి ఒక్కరు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు నెర్ధం భాస్కర్‌గౌడ్, బన్నాల ప్రవీణ్, పి.నర్సింగ్‌రావు, కొండల్‌రెడ్డి, కె.జగన్, నరేష్, రమేష్‌గౌడ్, నర్సింగ్‌రావు, సత్యరాజ్‌గౌడ్, మల్లేష్, పరమేష్, ప్రవీణ్, నవీన్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆరు గ్యారెంటీలు తప్పనిసరిగా అమలు



దరఖాస్తు పత్రాలను పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీమేరకు ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను తప్పనిసరిగా అమలు చేస్తుందని బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాతనరసింహారెడ్డి పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 6 గ్యారెంటీల దరఖాస్తు స్వీకరిస్తున్న కేంద్రాన్ని సరూర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులతో ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా పాలనలో సోనియాగాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 6 గ్యారంటీలకు అర్హులైన వారి దరఖాస్తులను స్వీకరిస్తామని,100 రోజులలో 6గ్యారంటీలు అమలు చేస్తామని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల పార్లమెంట్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల అరవింద్‌కుమార్, వీరమల్ల సుధాకర్‌గౌడ్, పులిగౌడ్, మహేందర్‌ముదిరాజ్, రంజిత్ పాల్గొన్నారు.

## అనాధ విద్యార్థులకు లయన్స్ క్లబ్ చేయూత



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న విజయ రంగ

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కొత్తపేట డివిజన్ సత్యానగర్‌లోని స్మైల్ ఫౌండేషన్ అనాధ విద్యార్థులకు లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట శాఖ చేయూతను అందించింది. అనాధాశ్రమంలో చదువుతున్న సుమారు 40 మంది విద్యార్థులకు అవసరమైన బియ్యము, దుప్పట్లు, పలు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందజేశారు. లైన్స్‌క్లబ్ భవిష్యత్తులో కూడా విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడానికి ముందుంటామని లైన్స్‌క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ బి.విజయరంగా, జితేందర్‌దేవి, రేణిగుంట శ్రీనివాస్, కందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పట్టుదలతో విజయాలు సాధించాలి : ఎమ్మెల్యే



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** క్రీడాకారులు పట్టుదలతో విజయాలు సాధించి దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలలో తెలంగాణ నుండి ఎల్బీనగర్‌కు చెందిన విద్యార్థులు తమ సత్తాను చాటారు. నేపాల్ దేశంలో జరిగిన జాతీయ స్థాయి టార్గెట్‌బాల్ పోటీలలో లాస్య, శరత్‌కళ్యాణ్ తమ ప్రతిభను చాటిన క్రీడాకారులు శుక్రవారం సుధీర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించారు. టార్గెట్ బాల్ పోటీల్లో లాస్యకు బంగారు పతకం, శరత్‌కళ్యాణ్‌కు సిల్వర్ పతకం రావడంపట్ల అభినందించారు. వీరిద్దరు ఎల్‌బినగర్ నియోజకవర్గనికి చెందిన వారు కావడం గర్వించదగ్గ విషయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని తమ సహాయ, సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకోజు కృష్ణమాచారి, నిష్కాంత్‌రెడ్డి, కోచ్ నందు, ఉమశంకర్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రజలకు సువర్ణావకాశం : ఎంపిఆర్



స్వరూప్‌నగర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాపాలన కార్యక్రమం చరిత్రలో నిలిచిపోనుందని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ డివిజన్ సౌత్ స్వరూప్‌నగర్, పాత రామంతాపూర్‌లో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తుందని, ఆరు గ్యారంటీలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు తౌఫిక్, సుర్వి మురళీగౌడ్, తవిడబోయిన గిరిబాబు, గరిక సుధాకర్, శ్రీకాంత్ యాదవ్, భాస్కర్, అకారపు అరుణ్, నర్సింగ్, లింగంపల్లి రామకృష్ణ, బొక్క సురేష్, జిల్లు, సందీప్, ముత్యాల జంగయ్య, నహీం, శంకర్, సందీప్, సుధాకర్, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, గోన ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి కందాల బలదేవ్‌రెడ్డి రాజీనామా

**తుర్కయంజాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడ గ్రామానికి చెందిన కందాల బలదేవ్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ సభ్యతానికి రాజీనామా చేస్తున్నానని 2003 నుండి 2012 వరకు 2015 నుండి 2023 వరకు క్రియాశీల రాజకీయంలో పనిచేశానని, అనేక ప్రజాసమస్యలను పరిష్కరించడానికి వచ్చి మీ సహకారంతో ప్రజా సమస్యలు పరిష్కరించారని అందుకుగాను మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేస్తూ కోహెడ గ్రామంలో అనేక అభివృద్ధి పనులుచేసే కోహెడ పరిసర ప్రాంతాలను అగ్రభాగంలో ఉంచారని అన్నారు. ఈ అనంతరం ధన్యవాదాలు తెలియజేసి బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలియజేసారు. పని చేసే క్రమంలో నాకు సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఉద్యమకారులకు ముఖ్యంగా పార్టీ రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి, క్యామ మల్లేష్, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య, కౌన్సిలర్లకు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

## ఆరు గ్యారెంటీలకు వెలువెత్తుతున్న దరఖాస్తులు అన్నింటికీ ఒకే దరఖాస్తుతో గందరగోళం



హయత్‌నగర్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో దరఖాస్తుదారుల సందడి



భాగ్యలతకాలనీ సమీపంలో గ్యాస్ ఏజెన్సీలోకి దూసుకుపోతున్న వినియోగదారులు

**హయత్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభయహస్తం ఆరుగ్యారెంటీల పథకానికి దరఖాస్తులు వెలువెత్తుతున్నాయి. అటు జీహెచ్ఎంసీ పరిధిలోని హయత్‌నగర్ డివిజన్‌లో 4 దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మన్సూరాబాద్ డివిజన్‌కు సంబంధించి మండల రెవెన్యూ కార్యాలయ పరిధిలో 4 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే... ప్రభుత్వం రూపకల్పన చేసిన దరఖాస్తు పత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఇంటర్నెట్, జీరాక్సు సెంటర్లకు దరఖాస్తు దారులు బారులు తీరుతున్నారు. ఇదే అదునుగా జీరాక్సు, ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకులు నాలుగు పేజీలు కలిగిన ఒక్కో దరఖాస్తు పత్రాన్ని 10-20 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఇక దరఖాస్తుకు జతచేయాల్సిన ఆధార్, రేషన్ కార్డు, పాసుపుస్తకాల జీరాక్సు వంటి వాటికోసం జీరాక్సు సెంటర్ల వద్ద వేచి చూడడం కన్పించింది. ఈకేవైసీ పేరిట గ్యాస్ ఏజెన్సీల వద్ద కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. ఇక ఆయా పథకాలకు సంబంధించి రేషన్ కార్డు తప్పనిసరి అని కొందరు, అవసరం లేదని కొందరు చెప్పడంతో దరఖాస్తు దారులలో అయోమయం నెలకొంది. ఇప్పటికే రేషన్ కార్డులు తీసుకున్న వారి సంగతి సరే... అర్హులైనా రేషన్ కార్డు లేనివారి సంగతి ఎంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాము దరఖాస్తు చేసుకున్నా గత ప్రభుత్వం 9 ఏళ్ల పాటు రేషన్ కార్డు ఇవ్వలేదని కొందరు వాపోతున్నారు. ఇక దరఖాస్తు పత్రంలో ఇంటి యజమానిగా ఎవరిని పేర్కొనాలి... ఆయా పథకాలకు సంబంధించి మహిళలు, పురుషులు వేరువేరుగా అర్హత ఉన్న పక్షంలో దరఖాస్తు పత్రంలో వివరాలను ఎలా పొందుపరచాలన్న విషయాలపై పలు అనుమానాలు నెలకొంటున్నాయి. ఉదాహరణకు ఇంటి యజమానిగా భర్తను పేర్కొంటే అదే దరఖాస్తు పత్రంలో రైతు బరోసా పథకంలో భార్యా, భర్తల ఇరువురి పేరిట భూములు ఉండి పాసుపుస్తకాలు ఉంటే ఇరువురి పేర్లు అందులో నమోదు చేయాలా లేదా అన్న సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. అరు గ్యారెంటీలకు సంబంధించి దరఖాస్తులను వేరువేరుగా అందుబాటులో ఉంచడం ద్వారా అర్హులు సులభంగా దరఖాస్తు చేసుకోవడానికి వీలవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం ఇలాంటి విషయాలపై దృష్టిసారించి అధికారుల ద్వారా సమావేశాలలో దరఖాస్తుదారులకు వివరించి అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఘనంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఉద్యమకారుల సన్మానం



ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

**తుర్కయంజాల్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** తెలంగాణఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూరు క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఉద్యమకారులతరపున పుష్పగుచ్ఛాలతో శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉద్యమకారుల సమస్యల గురించి వారితో చర్చించగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో పాటు ప్రత్యేకంగా ఉద్యమకారుల అభ్యున్నతికి వారి పూర్తి సహకారాన్ని తోడ్పాటును అందిస్తానని వాగ్దానం చేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగే విష్ణువర్ధన్, రాష్ట్ర కన్వీనర్ గుర్జని వెంకటేశంగౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కారింగుల నరేందర్‌గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి అధ్యక్షులు కొంతం యాదిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోసుపెల్లి వీరేశ్‌కుమార్, జిల్లా సీనియర్ ఉద్యమకారులు అంతటి ధనంజయ్యగౌడ్, బుర్ర జంగంగౌడ్, ఎం.డి.అక్బర్, నల్లా జగన్, నక్క జంగయ్యగౌడ్, అందేకర్ బాబులాల్, బంగారు నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలి:స్వప్న



తట్టిఅన్నారంలో దరఖాస్తు పత్రాలను అందిస్తున్న చైర్ పర్సన్ చెవుల స్వప్న, వైస్ చైర్‌పర్సన్, కమిషనర్ రవీందర్‌రెడ్డి తదితరులు

**హయత్‌నగర్, డిసెంబరు 29 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరుగ్యారెంటీలకు సంబంధించి అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చెవుల స్వప్న సూచించారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం, ఆర్.కె.నగర్, మర్రిపల్లిలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని వారు మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఒకే దరఖాస్తు పత్రంలో ఆరుగ్యారెంటీలకు సంబంధించి అవసరమైన సమాచారాన్ని పొందుపరిచి ఆయా వార్డులలో ఏర్పాటుచేసిన కేంద్రాలలో అందించాలని సూచించారు. ఏదేని సందేహాలు, అనుమానాలు ఉంటే ఆయా కేంద్రాలలోని అధికారులు, సిబ్బంది ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాశం అర్చన, దేవిడి గీత, రమావత్ పరశురాం, నాయకులు విజయశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, చిరంజీవి పాల్గొన్నారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దామోదర్ శర్మ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** కొలను శివారెడ్డినగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను దిల్‌సుక్‌నగర్‌లోని ఆలోచన కార్యాలయంలో శుక్రవారం ప్రముఖ వాస్తు జ్యోతిష్య మైసూరు దత్తపీఠం ఆస్థాన పండితులు డాక్టర్ బ్రహ్మశ్రీ వావిలాల దామోదర్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వావిలాల దామోదర్‌శర్మ మాట్లాడుతూ 2024 సంవత్సరం ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో భగవంతుని కృప ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొలను శివారెడ్డినగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొలను నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, ఆలోచన వ్యవస్థాపకులు జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ట్రెజరర్ బోగా చంద్రయ్య, కాలనీ కల్చరల్ కమిటీ చైర్మన్ శివరామకృష్ణ, జోర్కా రాము, దుబ్బ స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా హరిపురి కాలనీలో మహా పడిపూజ

**హైదరాబాద్, డిసెంబరు 29 ప్రభాతవార్త :** హరిహర సుత అయ్యప్పస్వామి మహాపడిపూజ ఆర్కేపురం డివిజన్ హరిపూరికాలనీలో శుక్రవారం మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతరెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి గిరిమారి నేతృత్వంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా అయ్యప్పస్వామి భక్తుల కోలాహలం మధ్య కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామిని కొలుస్తూ అయ్యప్పస్వామి భక్తులు భక్తి గీతాలను ఆలపించారు. మహా పడిపూజ అనంతరం అయ్యప్పస్వామి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంద్యాల నగేష్, పటేల్ నిఖిల్‌రెడ్డి, నిర్మలరెడ్డి, శ్రీరాధా, శైలజారెడ్డి, ఉషారెడ్డి, బాలుశ్రీ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో రాణించాలి : నేరేడ్‌మెట్ సీఐ శివకుమార్



సుధీక్షా ప్లేస్కూల్ చిన్నారులతో నేరేడ్‌మెట్ సీఐ శివకుమార్..

**నేరేడ్‌మెట్, డిసెంబర్29 ప్రభాతవార్త:** విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లో కూడా రాణించినప్పుడే భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని నేరేడ్‌మెట్ సీఐ శివకుమార్ అన్నారు. నేరేడ్‌మెట్ పోలిస్టేషన్ పరిధిలోని దీన్ దయాల్‌నగర్‌లో ఉన్న సుధీక్షా ప్లే స్కూల్ చిన్నారులు కమ్యూనిటీ హెల్పర్స్ థీమ్‌లో భాగంగా నేరేడ్‌మెట్ పోలిస్టేషన్, పోస్టాఫీస్, బ్యాంక్ తదితర కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు పోలీసు, లాయర్, డాక్టర్, ఆర్మీ తదితర వేషాధారణ వేసారు. ఈ సందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండే విద్యలో రాణించాలని అప్పుడే వారు అనుకున్న గమ్యాలను చేరుతారన్నారు. అనంతరం చిన్నారులు పోలీసు వృత్తికి సంబంధించిన పాటలను పాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, పోలీసు సిబ్బంది, పోస్టాఫీసు ఎస్.ఎపి.ఎం శ్రీవాత్సవ్, ఎస్బీఐబ్యాంకు సిబ్బంది, కరస్పాండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.